క్లుప్తంగా

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసిన సీడీపీవో



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీడీపీవో

జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారిగా (ఎఫ్ఏసీ) బాధ్యతలు చేపట్టిన మమత శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇంటింటా ఓటరు సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోదూర్, డబ్బా గ్రామాల్లో ఇంటింటా ఓటరు సర్వే చేస్తున్న కార్యక్రమాన్ని కోరుట్ల ఆర్డీవో ఆనంద్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. వచ్చే నెల 5వ తేదీ లోపు ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని బీఎల్వోలను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ రమేశ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరంలో చికిత్స అందిస్తున్న వైద్యాధికారి

కథలాపూర్: వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కథలాపూర్ వైద్యాధికారి సింధూజ అన్నారు. మండలంలోని చింతకుంట, తక్కళ్లపెల్లి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు హిరణ్మయి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, సునిత, ఏఎన్ఎంలు గంగామణి, రజిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ శిఖర ప్రతిష్ఠాపనోత్సవం



ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న నాయకులు

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన భేతాళ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భేతాళునికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కృష్ణారావులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

కోరుట్ల: పట్టణ శివారులోని సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. హుండీ లెక్కింపులో రూ. 5.9 లక్షల నగదు, 1 కిలో 600 గ్రాముల వెండి, మిశ్రమ బంగారం 28 గ్రాములు సమకూరినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కాంతా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు పెన్షన్ విద్రోహ దినం పాటించాలి

జగిత్యాల: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానానికి నిరసనగా సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా జేఏసీ చైర్మన్ బోగ శశిధర్ అన్నారు. శుక్రవారం తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సెప్టెంబర్ 1న ఉదయం 10.30 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ గంగుల సంతోష్‌కుమార్, నాగేందర్‌రెడ్డి, రమేశ్, అశోక్‌కుమార్, చంద్రయ్య, మహేశ్, సతీశ్, పవన్ పాల్గొన్నారు.

దోమల మోత...

- సాయంత్రమైతే చాలు దోమల విజృంభణ
- ఇంటి నుంచి బయటకు రాలేకపోతున్నామని ప్రజల ఆవేదన

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో దోమల విజృంభణతో ప్రజలు వణుకుతున్నారు. సాయంత్రమైతే చాలు ప్రజలు ఇంటి తలుపులు, కిటికీలు తెరవాలంటేనే భయపడుతున్నారు. కనీసం ఇంటి ఆవరణలో ఉండలేని పరిస్థితుల్లో ఉన్నామని ప్రజలు వాపోతున్నారు. వాడల్లోని డ్రెయినేజీలను సకాలంలో శుభ్రపరచకపోవడం, మురికినీటిపై దోమలు వృద్ధి చెంది దోమలు కుడుతున్నాయని.. ఫలితంగా జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నామమాత్రంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



కథలాపూర్‌లో యాదవకాలనీ రోడ్డులో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

పంచాయతీల్లో నిధుల కొరత.. ఫాగింగ్ చేయని వైనం.

మండలంలో 19 గ్రామాలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో బురదమయంగా మారాయి. గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో వర్షపునీరు, మురికినీరు వచ్చి చేరి దోమలకు నిలయంగా మారిందని పలువురు మండిపడుతున్నారు. వర్షాకాలం డ్రెయినేజీలో చెత్త పేరుకుపోయి మురికినీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందడానికి అవకాశమిచ్చినట్లయిందని ప్రజలు పేర్కొంటున్నారు. దోమలు కుడితే రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నామని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దోమల బెడద నివారించడానికి గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికి వినియోగించడం లేదు. ఆయా గ్రామపంచాయతీల్లో ఉన్న ఫాగింగ్ మిషన్లలో ఎన్ని పని చేస్తున్నాయో లేదో తెలియని పరిస్థితి. గత పాలకవర్గం సమయంలో ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసినప్పటికీ సరిగా వినియోగించకపోవడంతో మూలకు చేరినట్లు తెలిసింది. గ్రామంలో ఒక్కసారి ఫాగింగ్ చేయించాలంటే డీజిల్, పెట్రోలు, దోమల నివారణ మందు కోసం కనీసం రూ. 10 వేల వరకు ఖర్చవుతుందని మాజీ సర్పంచులు పేర్కొన్నారు. పంచాయతీల్లో నిధుల కొరత ఉండటం, గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఉద్యోగులు జేబుల్లో నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని పలువురు అంటున్నారు. దీంతో గ్రామాల్లో ఫాగింగ్‌ను పట్టించుకోవడంలేదని సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామాల్లో దోమల బెడదను నివారించడానికి ఎవరు చర్యలు తీసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది. దోమల బెడదతో ప్రజలు జ్వరాలతో ఆస్పత్రుల్లో చేరి వేలాది రూపాయలు వెచ్చిస్తుండటం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫాగింగ్ చేయిస్తాం



గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. గ్రామపంచాయతీల్లో ఉన్న ఫాగింగ్ మిషన్లు పనిచేయకపోతే ఇతర గ్రామాల నుంచి తెప్పించి ఫాగింగ్ చేయిస్తాం. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం బాధ్యతగా భావించాలి. పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం.

– రాజశేఖర్, ఎంపీవో, కథలాపూర్



మెట్‌పల్లిరూరల్: కొండ్రికర్ల గ్రామ పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న భవనాన్ని కూల్చి ఆపై వదిలేశారు. దిక్కుతోచని పరిస్థితుల్లో వినియోగంలో లేని ఏళ్ల నాటి పాత ప్రాథమిక పాఠశాల భవనం నుంచే కొన్ని నెలలుగా పంచాయతీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా.. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఫలితంగా పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదన్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మపురి: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించినపుడే మంచి గుర్తింపు లభిస్తుందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మపురిలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల పాఠశాలల క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా విప్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కల్గిస్తాయని అందుకు చదువుకు ప్రథమ ప్రాధాన్యత నిస్తూ ఆటలకు కూడ సమయం కెటాయిస్తే మరింత బాగుంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు మండల స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని అటువంటి విద్యార్థులకు ప్రభుత్వం తరుపున మంచి ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ధర్మపురిలో అన్ని వర్గాలకు చెందిన పిల్లల హాస్టల్ కొరకు ఒక ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, హెచ్ఎం మహేందర్, నాయకులు పాల్గొన్నారు.



ధర్మపురిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్

రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దు

మల్లాపూర్: అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ జరుగుతుందని, రైతులు ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పద్మశాలీ సంఘం జిల్లా నాయకులు సిరిపురం రవీందర్, మండల అధ్యక్షుడు అయ్యోరి దశరథంతో పాటు సభ్యులు పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ చేరగా, వారికి పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీ మేరకే రూ.2లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేసిందన్నారు. కాగ వివిధ సాంకేతిక సమస్యలతో కొంత మంది రైతులకు రుణమాఫీ కాలేదని, ఆ రైతులందరూ మీ క్లస్టర్ పరిధిల్లోని వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో)లను కలిసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రుణమాఫీపై బీఆర్ఎస్, బీజేపీ వంటి విపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. రైతులకు రుణమాఫీ చేయడంతో బీఆర్ఎస్, బీజేపీలకు మింగుడుపడటం లేదని దుయ్యబట్టారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకేట నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, సేవాదల్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: రాజకీయ లబ్ధి కోసమే రుణమాఫీ పై బీజేపీ, బీఆర్ఎస్ ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మేడిపల్లి మాట్లాడారు. దేశ చరిత్రలోనే ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని రైతులందరికీ ఏక కాలంలో రుణమాఫీ చేశామని తెలిపారు. సీఎం రేవంత్ ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ చేశారన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాలేని రైతులకు త్వరలో రుణమాఫీ చేస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి కుట్రలను రైతులు నమ్మొద్దని సూచించారు.

ఎంపీడీవో సేవలు మరువలేనివి



సన్మానిస్తున్న జెడ్పీ సీఈవో, అధికారులు

మల్లాపూర్: ఎంపీడీవోగా నల్ల రాజేందర్‌రెడ్డి సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ సీఈవో, ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) గౌతమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మెట్‌పల్లి మండలంలోని వేంపేట శివారులో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో మెట్‌పల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి నక్క శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఎంపీడీవో నల్ల రాజేందర్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు చేపట్టి వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వర్తించాడన్నారు. ఎంపీడీవో రాజేందర్ రెడ్డి దంపతులను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో, ఇంచార్జీ డీపీవో రఘువరణ్, అడిషనల్ డీఆర్డీవో మధన్‌మోహన్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య పరీక్షలు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివగాయత్రి అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలతో పాటు షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్స్ శ్రీనివాస్, నాగలింగం, ఆశ్రమ నిర్వాహకులు సూరజ్ శివశంకర్, కాలగిరి బాపురెడ్డి, చంద్రమౌళి, ఎలిమెల సత్తయ్య, గుండేటి రాజు, మేనేజర్ రోహిణి పాల్గొన్నారు.

భజన మందిరం నిర్మాణానికి భూమిపూజ

జగిత్యాలటౌన్: ఆధ్యాత్మిక చింతనతో ఆరోగ్యం పెంపొందించుకోవచ్చునని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణ బ్రాహ్మణవాడలోని శ్రీరామమందిరంలో రూ.10 లక్షల టీటీడీ నిధులతో చేపడుతున్న భజన మందిర నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భూమిపూజ చేశారు. అనంతరం శ్రీరామ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తి పాటలు ఆలపించడం వల్ల ఊపిరి తిత్తులు బలోపేతమయి శ్వాస సంబంధ వ్యాదులు రాకుండా ఉంటుందన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ, టీవీ సూర్యం, తిగుళ్ల సూర్యనారాయణ శర్మ, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఉన్నారు.



భూమిపూజలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్

వినాయక మంటపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలి

జగిత్యాలటౌన్: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేయబోయే వినాయక మంటపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం బల్దియా చైర్మన్ అడువాల జ్యోతి లేఖ రాశారు. హైదరాబాద్ నగరంలో వినాయక మంటపాలకు సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించిన నేపథ్యంలో జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసే వినాయక మంటపాలకు సైతం ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిందిగా చైర్మన్‌కు రాసిన లేఖలో కోరారు.

ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలి

జగిత్యాల: ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఈనెల 27న మున్సిపల్ సాదారణ సమావేశం జరిగిందని, ఇందులో 33 ఎజెండా అంశాలను పొందుపర్చారని తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా 25 మంది లేబర్లను ఎంగేజ్ చేసుకోవడానికి కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారని, మెజార్టీ సభ్యులు టీఎల్ఎఫ్ ద్వారా కాకుండా టెండర్ ద్వారా నిర్వహించాలని కోరారని, టీఎల్ఎఫ్ ద్వారా నిర్వహిస్తే మున్సిపల్‌కు ఆదాయం రాదని, టెండర్‌ద్వారా నిర్వహించాలని కోరారు.

బాలికల కోసం చైల్డ్ హెల్ప్‌లైన్

జగిత్యాల: బాలబాలికల రక్షణకు, సంరక్షణ కోసం 24 గంటలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పనిచేస్తుందని కో–ఆర్డినేటర్ కడారి శ్రవణ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలకార్మికులు, బిక్షాటన చేస్తూ ఎవరైనా కన్పించినా, ఏవైనా ఇబ్బందులున్నా 1098కు టోల్‌ఫ్రీనంబరుకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళ సాధికారత సభ్యులు స్వప్న, కైలాష్, రజిత పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

మల్లాపూర్: ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఎస్సై కిరణ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అనుమతి పొందిన కమర్షియల్ ట్రాక్టర్లతో మాత్రమే ఇసుక రవాణా చేసేందుకు అర్హత ఉంటుందన్నారు. మన ఇసుక యాప్ మొబైల్ పోర్టల్ లేదా ఆన్‌లైన్ యందు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో ఆర్ఐ సురేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్వోసీ మంజూరు

కోరుట్ల: పట్టణంలోని రవీంద్రా రోడ్‌లో నివాసముండే సబీనా బేగంకు రూ. 2.5 లక్షల ఎల్వోసీ మంజూరైంది. సబీనా బేగం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరగా విషయం కోరుట్ల కాంగ్రెస్ సెగ్మెంట్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో మాట్లాడి బాధితురాలికి అత్యవసర వైద్య ఖర్చులకు రూ. 2.5 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు.ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావుకు, విప్ ఆది శ్రీనివాస్‌కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

మెట్‌పల్లి: బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పిసరి నర్సయ్య కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ప్రతీ బూత్‌లో 200పైగా సభ్యత్వాలను నమోదు చేయించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షులు బొడ్ల రమేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్ పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

రాయికల్: వినాయక నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. శుక్రవారం రాయికల్ ఠాణాలో యువజన సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, మంటపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నిమజ్జనంలో డీజేలు వినియోగించరాదని సూచించారు. ప్రతీ మండపం వివరాలను పోలీసులకు సమర్పించాలని కోరారు. తప్పనిసరిగా మున్సిపల్, గ్రామపంచాయతీ, ట్రాన్స్‌కో అధికారులతో సమన్వయం చేసుకుని నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో జగిత్యాలరూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు డీజే అనుమతి లేదు

మల్యాల: వినాయక ఉత్సవాల్లో మంటపాల వద్ద డీజేకు అనుమతి లేదని, మైక్ సౌండ్‌తో ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై నరేశ్ కుమార్ అన్నారు. డీజే నిర్వాహకులకు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. వినాయక ఉత్సవాల్లో మంటపాల వద్ద డీజే ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని అన్నారు.వినాయకుల నిమజ్జనం వరకు నిర్వాహకులే బాధ్యత వహించాలన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

పీఆర్టీయూతోనే టీచర్ల సమస్యలకు పరిష్కారం

మల్లాపూర్: ఉపాధ్యాయులకు పీఆర్టీయూ సంఘం అండగా నిలుస్తుందని, పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని, మండల అధ్యక్షుడు ఎనగందుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పీఆర్టీయూ టీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే పీఆర్టీయూ ఉద్యమిస్తుందన్నారు. సీపీఎస్ రద్దు కోసం పీఆర్టీయూ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేయడమే లక్ష్యంగా అవిశ్రాంత పోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి లక్కిడి శ్రీనివాస్‌రెడ్డి, జౌడి రాజరెడ్డి, గంగాధరి రవి, కుంబాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం

ఇబ్రహీంపట్నం: మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో టీఎస్ పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె. వెంకటేశ్, ప్రధానకార్యదర్శిగా ఉలిసే వెంకటేశ్వర్‌రావు, అసోషియేట్ అధ్యక్షుడిగా దాసరి నవీన్‌కుమార్, మహిళ ఉపాధ్యక్షురాలిగా యాస్మిన్, కార్యదర్శిగా లింగయ్య, మహిళ కార్యదర్శిగా గంగామణి, ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, చిన్నయ్య పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి



శాకాంబరిగా అమ్మవారు

జగిత్యాలటౌన్: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా చివరి శుక్రవారం కావడంతో పట్టణంలోని పలు ఆలయాల్లో సందడి నెలకొంది. అరవింద్‌నగర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారు శాకాంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాస ముగింపు వేడుకల్లో భాగంగా సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణం, పల్లకి సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని శ్రీఅష్టలక్ష్మీసహిత లక్ష్మీనారాయణ ఆలయంలో సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, భజనలు, అష్టోత్తర శతనామ పూజ, మహాహారతి, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మీ ఆలయంలో భక్తుల పూజలు

నాగమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

పెగడపల్లి: మండలంలోని ఆరవెల్లి నాయకురాలు నాగమ్మ ఆలయం వద్ద సందడి నెలకొంది. ప్రతి ఏటా శ్రావణమాసంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఇక్కడ మొక్కలు చెల్లించుకుంటారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో పలు గ్రామాల నుంచి మహిళలు బోనాలతో చేరుకుని నాగమ్మకు నైవేద్యం సమర్పించుకున్నారు. గొర్రెలు, మేకలు బలిచ్చి వంటావార్పుతో విందు చేసుకున్నారు.



బోనాలు సమర్పించిన మహిళలు